క్లుప్తంగా

సీఎం జగనన్న రుణం తీర్చుకోవాలని పిలుపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని దివ్యాంగులకు అనేక రకాలుగా మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటేసి జగనన్న రుణం తీర్చుకోవాలని వైఎస్సార్ ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, విద్యాధరపురానికి చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రతి దివ్యాంగుడు వైఎస్సార్ సీపీ స్టార్ క్యాంపెయినర్‌గా నిలిచి తమ కుటుంబంతో పాటు బంధువు, స్నేహితులతో జగనన్న మనకు చేసిన మేలును వివరించి ఓట్లు వేయించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న వారం రోజుల్లో దివ్యాంగులంతా అవకాశం ఉన్నంత వరకు తమ తమ గ్రామాలు, పట్టణాల్లో పర్యటించి ఆయా నియోజకవర్గాల్లోని వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. జగనన్న గెలుపునకు మేము సైతం అంటూ ఎలుగెత్తి చాటాలని కోరారు.

బ్యాంక్‌ల వద్ద పింఛన్‌దారుల పడిగాపులు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మా జగన్ బాబు మళ్లీ గెలుస్తాడు.. మాకు ఈ కష్టాలు మరో ఐదేళ్లు ఉండవు.. ఇలా బ్యాంకులు, డబ్బులు ఇచ్చే వారి వద్ద గంటల తరబడి కూర్చోవాల్సిన పని లేదు.. తెల్లవారే సరికి ఇంటికి వచ్చి డబ్బులు ఇచ్చేవారు... మా బాధలు జగన్‌బాబుకే తెలుసునని కన్నీటి పర్యంతమయ్యారు.. ఇదీ పశ్చిమ నియోజక వర్గంలో గురువారం పలు కస్టమర్ సర్వీసు పాయింట్ల వద్ద, ఏటీఎంల వద్ద వృద్ధులు, వితంతువుల మాట.. పెన్షన్ డబ్బుల కోసం ఉదయం 8 గంటలకే బ్యాంకుల వద్ద వృద్ధులు, వితంతువులు చేరుకోవడం గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి. 10 గంటలకు బ్యాంకుల వద్ద లబ్ధిదారుల క్యూ బారులు తీరి ఉండటంతో వారు బ్యాంక్ సమీపంలో ఉన్న కస్టమర్ సర్వీసు పాయింట్ల వద్దకు చేరుకున్నారు. తమ ఖాతాలో నుంచి డబ్బులు తీసుకునేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు.

దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు, అర్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయం వద్ద దక్షిణామూర్తికి గురువారం విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. స్వామివారి ఆలయానికి దక్షిణం వైపున ఉన్న దక్షిణామూర్తి విగ్రహానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈవో కెఎస్.రామరావు పాల్గొనగా, ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి, మల్లేశ్వరాలయ ప్రధాన అర్చకులు మల్లేశ్వర శాస్త్రి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని, ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో గురువారం అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వేసవి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ తాము ప్రతీ ఏటా ప్రముఖ రిసోర్స్‌పర్సన్‌లతో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. చిత్రలేఖనం, చేతిరాత, క్రాఫ్ట్, యోగా, క్లే వర్క్, వెస్ట్రన్, ఫోక్ డ్యాన్స్ తదితర విభాగాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తప్పుడు ప్రచారం

కంకిపాడు: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు, కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకట సుబ్బారావు విమర్శించారు. కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలను పరిష్కరింప చేసే విధంగా ల్యాండ్ టైట్లింగ్‌చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కూటమిలో అంటకాగుతూనే ప్రజల్ని గందరగోళానికి గురిచేస్తుందన్నారు.

సాధ్యం కానీ హామీలతో టీడీపీ మోసం చేస్తుంది

- సుజనాచౌదరి ఒక ఆర్థిక నేరస్తుడు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్



ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్, కాకుమాను రాజశేఖర్, కేశినేని శ్వేతలను సత్కరిస్తున్న నాయకులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): సాధ్యం కానీ హామీలతో మరో మారు ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ యత్నిస్తుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్.ఆసిఫ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన లిడ్ కాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, కేశినేని శ్వేతతో కలిసి 35వ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్‌లోని ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోలో 99 శాతం అమలు చేసి ప్రజల మనసులను గెలుచుకున్నారన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం చెప్పిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ఇప్పుడు మళ్లీ సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసగించేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు సిద్ధమయ్యాయన్నారు. వారు చెప్పే కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

ఆంధ్రా మాల్యా.. సుజనా

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి ఒక ఆర్థిక నేరస్తుడని ఆసిఫ్ విమర్శించారు. బ్యాంకులను మోసగించి కోట్ల రూపాయలను దోచుకున్నాడని, ఆ డబ్బుతో గెలవాలని చూస్తున్నాడన్నారు. ఆయన ఒక స్కామ్ స్టార్, ఆంధ్రా మాల్యాలాగానే ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. పశ్చిమ నియోజక వర్గ ప్రజలు తెలివైనవారని సుజనాచౌదరిని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. లిడ్ కాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ.. పేదలు వైఎస్ జగన్ పక్షాన ఉన్నారన్నారు. ఇచ్చిన మాట తూ.చ. తప్పకుండా నెరవేర్చిన నాయకుడు జగనన్న అన్నారు. ప్రజా సేవలో నిస్వార్థంగా పనిచేస్తున్న ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేశినేని శ్వేత మాట్లాడుతూ.. నికార్సైన కార్యకర్తను, మంచి వ్యక్తిని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పోటీలో నిలిపారని, వారిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, కార్పొరేటర్ యలకల చలపతిరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, నాయకులు శివ, కనపర్తి సుజతదాస్, బాబు, సంజయ్, బ్యూలా, శ్రీదేవి, షీభా, దేవమణి పాల్గొన్నారు.

వృద్ధులను రోడ్లపైకి తెచ్చిన దుర్మార్గుడు చంద్రబాబు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్



43వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఆసిఫ్, నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వృద్ధులను మండుటెండలో రోడ్లపైకి తీసుకొచ్చిన దుర్మార్గుడు చంద్రబాబునాయుడు అని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. నియోజకవర్గంలోని 43వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక కార్పొరేటర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో షేక్ ఆసిఫ్, ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల మద్దతు కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమం వివరిస్తూ, ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

అనంతరం ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ.. నేడు అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం తీవ్ర ఆందోళనకు గురవుతూ ఎదురు చూస్తుండటం ఎంతో బాధగా ఉందన్నారు. 58 నెలలుగా జగనన్న ప్రభుత్వం లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా సెలవు రోజు అయినా ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే వారి ఇంటి వద్దే పింఛన్లు అందించిందన్నారు. కానీ ఎన్నికల పేరుతో చంద్రబాబు తన మనిషి నిమ్మగడ్డ రమేష్‌తో వలంటీర్లపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించి వృద్ధులు, దివ్యాంగులను రోడ్డుపైకి తీసుకొచ్చారన్నారు. గత మాసంలో ఎండల కారణంగా పెన్షన్ల పేరుతో 32 మంది మృతికి చంద్రబాబు కారణమయ్యాడన్నారు. పెన్షన్‌దారుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ నెపాన్ని ప్రభుత్వం పైకి నెట్టేందుకు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ డబ్బులు జమ చేయవచ్చని మాట మార్చారన్నారు. ప్రజల చేతిలో ఆయనకు తగిన గుణపాఠం తప్పదన్నారు.

ఆర్థిక నేరస్తుడు సుజనా చౌదరి

మళ్లీ జగనన్న రెండోసారి ముఖ్యమంత్రి అవుతారని, వలంటీర్లు మళ్లీ ప్రతి గడప వద్దే ఒకటో తేదీ ఉదయమే పింఛన్లు అందిస్తారని చెప్పారు. ఈ ఒక్క నెల జాగ్రత్తగా ఉండాలని, ఎవరూ ఆందోళన చెందవద్దని పింఛనుదారులను కోరుతున్నట్లు చెప్పారు. దేశంలో పలు జాతీయ బ్యాంకులను బురిడీ కొట్టించిన ఆర్థిక నేరస్తుడు సుజనా చౌదరి అన్నారు. బీజేపీ కండువా కప్పుకుని తాను టీడీపీ వాడినేనని ప్రజలను కూడా బురిడీ కొట్టిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఆయన ఎన్ని అబద్ధాలు చెప్పినా పశ్చిమ నియోజకవర్గ ప్రజలు నమ్మరన్నారు. సుజనా చౌదరి ఎన్ని కోట్లు కుమ్మరించినా ప్రజల మనసులో ఆయనపై ఉన్న ముద్రను, బీజేపీ రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని చెరిపివేయలేరన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి శ్రీహరి, దుర్గగుడి పాలకమండలి ధర్మకర్త కట్టా సత్తయ్య, పాతశివాలయం చైర్మన్ బొమ్ము మధు, కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, నాయకులు నర్సారెడ్డి, తిరుపతిరావు, సత్యనారాయణ రెడ్డి, మహేందర్ రెడ్డి, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ.. మా ఉసురు తగులుతుంది!

- మండుటెండలో వృద్ధుల అవస్థలు
- బ్యాంకుల్లో తప్పని ఇబ్బందులు
- ఆందోళనలో వృద్ధుల కుటుంబ సభ్యులు



కొత్తపేటలోని ఎస్‌బీఐలో బారులు తీరిన వృద్ధులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భానుడి భగభగలతో మండుటెండ నగరంలో ఆ వృద్ధులను నానా అవస్థలకు గురి చేసింది. జీవిత చరమాంకంలో ఉన్న చాలా మంది వృద్ధులు పెన్షన్ కోసం బ్యాంకుల వద్దకు పరుగులు తీశారు. చంద్రబాబు నిర్వాకం కారణంగా పెన్షన్‌దారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ప్రతి నెలా మొదటి తేదీన తెల్లవారుజామునే ఇంటింటికి వెళ్లి వలంటీర్లు అవ్వాతాతలకు పెన్షన్లు ఇచ్చేవారు. వృద్ధుల కళ్లలో ఆనందాన్ని చూసేవారు. కానీ వృద్ధుల ఆనందాన్ని చూసి చంద్రబాబు అండ్ కంపెనీకి కళ్లు కుట్టాయి. ఎన్నికల కమిషన్‌కు లేఖలు, న్యాయస్థానాల్లో కేసులు వేసి వలంటీర్ల ద్వారా పెన్షన్ వెళ్లకుండా కుట్రలు చేశారు. దాంతో రెండు మాసాలుగా రాష్ట్రంలో వారి బాధలు చెప్పటానికి వీలు కాకుండా ఉన్నాయి.

కిక్కిరిసిన బ్యాంక్‌లు

ఒక వైపు తమ ఖాతాల్లో నగదు పడినది లేనిది తెలియక, పడిన నగదును తీసుకోవటం ఎలానో తెలియక వృద్ధులు మండుటెండలో విలవిలలాడారు. ముఖ్యంగా గురువారం ఎండ తాకిడి అధికంగా ఉంది. ఆ మండుటెండలో వృద్ధులు తీవ్ర అవస్థలు పడ్డారు. వృద్ధుల ఆధార్‌కార్డు బ్యాంకుల ఖాతాలకు అటాచ్ అయిన వారికి వారివారి ఖాతాల్లో పెన్షన్ నగదును వేయాలని ప్రభుత్వానికి ఉత్తర్వులు ఉన్నాయి. దాంతో వారివారి ఖాతాల్లో ప్రభుత్వం నగదును వేసింది. అయితే ఆ నగదును తీసుకోవటానికి నగరంలోని ఆయా బ్యాంకుల వద్దకు వృద్ధులు పోటెత్తారు. ఖాతాలో ఉన్న నగదును తీసుకోవటానికి క్యూలైన్లలో బారులు తీరారు. ఒక్కసారిగా బ్యాంకులకు వృద్ధులు తరలిరావటంతో ఆయా ప్రాంగణాలన్నీ కిక్కిరిసిపోయాయి. వందలాది మంది తరలిరావటంతో బ్యాంక్ సిబ్బంది సైతం ఇబ్బందులు పడ్డారు. ఊహించని రీతిలో వారు తరలిరావటంతో మంచి నీరు, సరిపడా కుర్చీలు సైతం ఏర్పాటు చేయలేదు.

పత్రాల కోసం పరుగులు

వృద్ధులు తమ బ్యాంక్ ఖాతాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోకపోవటంతో బ్యాంక్ సిబ్బంది వారిని కేవైసీ పత్రాలు కావాలని అడిగారు. ఆధార్ జిరాక్స్‌తో వచ్చిన వారిని పాన్ కార్డు నెంబర్ సైతం కావాలని ప్రశ్నించటంతో వృద్ధులకు అర్థం కాక సతమతమయ్యారు. అదేంటో మాకు తెలియటం లేదంటూ వాపోయారు. అన్ని బ్యాంకుల వద్ద ఇదే రీతిలో ప్రశ్నల పరంపర ఎదురైంది. క్యూలైన్‌లో నిలబడి కౌంటర్ వరకూ వెళ్లిన తరువాత వారడిగిన పత్రాల కోసం మళ్లీ బయటకు పరుగులు పెట్టడం, తిరిగి వాటితో వెళ్లటం వృద్ధులను తీవ్ర అవస్థలకు గురి చేసింది. దానికి తోడు ఆధార్ జిరాక్స్ కాపీల కోసం వృద్ధులు ఆ ఎండలో బయట రోడ్లపై తిరగటంతో వారంతా నానా తంటాలు పడాల్సి వచ్చింది. అసలు చాలా మందికి పాన్‌కార్డు నెంబర్ కావాలంటే అది తమకు తెలియదని మేం ఏమి చేయాలి...? అంటూ ప్రశ్నించటటం కనిపించింది.

అర్థం కాక ఇబ్బందులు

వృద్ధులు పెన్షన్ల కోసం బ్యాంకుల చుట్టూ తిరగటంతో వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. వృద్ధులు బ్యాంకుల వద్దకు వచ్చి అక్కడ సిబ్బంది చెప్పిన విషయాలు అర్థం కాక కుటుంబ సభ్యులను తీసుకురావటం కనిపించింది. వారికి బ్యాంకు సిబ్బంది పాన్‌కార్డు నంబర్ కావాలని, ఆధార్ జిరాక్స్ కావాలని అప్పుడే బ్యాంక్ ఖాతాలు అప్ టు డేట్ అవుతాయంటూ వారు సమాధానమిస్తున్నారు. దాంతో ఈ ఎండలో ఎందుకు ఇదంతా తరువాత తీసుకుందాంలే అని వృద్ధులకు నచ్చచెబుతున్నా వారు మాత్రం తీసుకోవాల్సినదేనని పట్టు పట్టడంతో బ్యాంక్‌ల వద్ద రద్దీ కొనసాగుతూనే కనిపించింది.

చంద్రబాబు కారణంగా ఈ అవస్థలు..



ఇంటింటికీ ఇచ్చే పెన్షన్లను ఇలా బ్యాంకులు, సచివాలయాలంటూ మాలాంటి వృద్ధులను మండుటెండలో ఇలా తిప్పుతున్న చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది. ఈ వయస్సులో ఇంత ఎండ వేడిలో ఎలా తిరుగతాం. మాకు ఏదైనా జరిగితే ఎవరిది బాధ్యత. జగన్ ప్రతి నెలా ఇంటికి పెన్షన్ పంపించేవాడు. చంద్రబాబు కారణంగా ఈ అవస్థలు వచ్చాయి. – లక్ష్మమ్మ, గొల్లంపాలెంగట్టు

ఇది మంచి పద్ధతి కాదు..



చంద్రబాబు తన రాజకీయాల కోసం మమ్మల్ని ఇబ్బందులు పాలు చేయటం మంచి పద్ధతి కాదు. ఎంతో సౌకర్యవంతంగా ఉండే విధంగా వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టడం చూస్తుంటే చంద్రబాబు కుటిల రాజకీయానికి అద్దం పడుతుంది. మండుటెండలో బ్యాంక్‌లకు వద్దకు పరుగులు పెట్టి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. – నజీరున్నీసా, వించిపేట

మాపై బాబు పగ పట్టారు..



కాళ్లు కదపలేని స్థితిలో ఉన్న మాపై చంద్రబాబు పగ పెట్టుకున్నారనిపిస్తుంది. ప్రతి నెలా వలంటీర్లు నేరుగా ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ ఇచ్చేవారు. కానీ మాపై కక్ష సాధింపు చేయటం ఏమిటి. మేము అవస్థలు పడుతుంటే రాక్షసానందం పొందుతున్నారు. చంద్రబాబు మంచి చేయకపోగా మా లాంటి వృద్ధులపై, దివ్యాంగులపై ఈ విధమైన చర్యలు సరైనవి కావు. – పిళ్లా సన్నాయమ్మ, కొత్తపేట

హోం ఓటింగ్ వాహనం ప్రారంభం



పెనమలూరు: హోం ఓటింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేశామని పెనమలూరు రిటర్నింగ్ అధికారి డి.రాజు అన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో హోం ఓటింగ్‌కు రిటర్నింగ్ అధికారి డి.రాజు జెండా ఊపి గురువారం వాహనాలను ప్రారంభించారు. రిటరి్నంగ్ అధికారి రాజు వివరాలు తెలుపుతూ పెనమలూరు నియోజకవర్గంలతో 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు, అలాగే 40 శాతంతో అంగవైకల్యం ఉన్న ఓటర్లు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేశారన్నారు. తాము అన్ని పరిశీలించి 379 మందికి హోం ఓటింగ్‌కు అనుమతులు ఇచ్చామని తెలిపారు. హోం ఓటింగ్‌కు ఆరు టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆరు టీమ్‌లు ఆరు రూట్‌లలో వాహనాలలో వెళ్లి 379 మంది వద్ద బ్యాలెట్‌తో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటారని అన్నారు. ఒక్కో టీమ్‌లో పీఓ, ఏపీవో, మైక్రోఅబ్జర్వర్, పోలీస్, వీడియోగ్రాఫర్ ఉంటారన్నారు. ఆయా పోలీంగ్ కేంద్రం పరిధిలో ఉన్న హోం ఓటర్లకు బీఎల్‌వో ఉంటారని తెలిపారు. హోం ఓటర్లు ఉంటున్న ఇళ్లకు అధికారులు చేరుకొని ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సహకరిస్తారని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ టీవీవీ రామారావు, డీటీలు భవాని, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్



షారోన్ చర్చిలో ఆసిఫ్‌ను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 40వ డివిజన్ కరకట్ట ప్రాంతంలోని షారోన్ చర్చిలో ఆసిఫ్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆసిఫ్ ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ క్రైస్తవ సోదరులు సమష్టిగా ప్రార్థనలు చేశారు. దైవ సేవకులు ఫాదర్ కృపా కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఆసిఫ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విభిన్న మతాలు, కులాల ప్రజలు శాంతియుతంగా కలిసి మెలసి జీవనం సాగిస్తున్నారన్నారు. మతాల మధ్య, కులాల మధ్య వివాదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలోనే బీజేపీ ఇక్కడ నుంచి పోటీ చేస్తోందని చెప్పారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టే మతతత్వ పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేసేందుకు అంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. క్రైస్తవ సోదరులంతా వైఎస్సార్ సీపీకి మద్దతివ్వాలని కోరారు. 40వ డివిజన్ కార్పొరేటర్ అంజనేయ రెడ్డి, పాస్టర్లు చక్రవర్తి, మాథ్యూస్, జాన్సన్, జాన్ వెస్లీ పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు పరిశీలించిన ఈవో



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడుతున్న ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులతో పాటు భక్తులకు దేవస్థానం అందిస్తున్న సేవలను ఈవో కె.ఎస్.రామరావు గురువారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఎదుట దేవస్థానం నిర్మిస్తున్న లడ్డూ పోటు, అన్నదాన భవనం పనులను పరిశీలించారు. కనకదుర్గనగర్ నుంచి మహా మండపానికి అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న క్యూకాంప్లెక్స్ పనులను ఈఈ లింగం రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహా మండపం రెండు, మూడు అంతస్తులోని అన్నప్రసాద వితరణ తీరును పరిశీలించారు. అమ్మవారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో ఈవో మాట్లాడారు. అన్న ప్రసాద నాణ్యత, ఇంకా మెరుగైన సేవలను కల్పించే దిశగా వారిని అడిగి తెలుసుకున్నారు. అన్నం నాణ్యతను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అన్నదానం స్వీకరించిన అనంతరం భక్తులు ఇచ్చే విరాళాలకు తగిన రశీదులు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. విరాళాలు దుర్వినియోగం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సుజనా చౌదరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ఇన్‌స్పెక్టర్ కృష్ణకు ఫిర్యాదు అందజేస్తున్న గౌస్ మొహిద్దీన్, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్న పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ కోరారు. ఆయన భవానీపురం ఇన్‌స్పెక్టర్ కృష్ణకు గురువారం ఫిర్యాదు చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో సుజనా చౌదరి అధ్యక్షతన ఇటీవల జరిగిన ఒక సమావేశంలో టీడీపీ నాయకుడు జలీల్‌ఖాన్ కొంత మంది ఓటర్ల చేత 'దేవుడి సాక్షిగా, అమ్మవారి సాక్షిగా' సుజనా చౌదరికి ఓటేసి గెలిపిస్తామని ప్రమాణం చేయించారన్నారు. ఇది కచ్చితంగా ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని గౌస్ మొహిద్దీన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుతో పాటు తాను ఇచ్చిన రికార్డెడ్ ఆధారాల సాక్ష్యంగా తక్షణమే సుజనా చౌదరి, జలీల్‌ఖాన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు అందజేసిన వారిలో వైఎస్సార్ సీపీ లీగల్ టీమ్ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు నంబూరు ప్రదీప్, సాంబిరెడ్డి, ప్రసాద్, వెంకటరెడ్డి, నరసింహారెడ్డి ఉన్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా సీఎం వైఎస్ జగన్



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న నూరుద్దీన్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి సంపూర్ణ అండదండలందిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ నూరుద్దీన్ ఆసిఫ్‌ను వించిపేటలోని ఆయన కార్యాలయంలో కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నూరుద్దీన్ ఆసిఫ్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా ముస్లిం మైనార్టీలకు ఏడు అసెంబ్లీ సీట్లు కేటాయించారని గుర్తు చేశారు.

కొన్ని పార్టీలకు చెందిన మతోన్మాద శక్తులు వలన సమాజానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. వారిని తరిమికొట్టేందుకు అందరూ కలిసి రావాలని కోరారు. నూరుద్దీన్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత మంచి వ్యక్తి ఆసిఫ్‌ను పశ్చిమ అభ్యర్థిగా ప్రకటించటం ఆనందంగా ఉందన్నారు. ఆసిఫ్‌ను యావత్ ముస్లిం సమాజం గెలిపించుకుంటుందన్నారు. అంతేకాకుండా అందరికీ మేలు చేసే ఆసిఫ్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు షేక్ బషీరుల్లా, కరిముల్లా, అల్తాఫ్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, మొహమ్మద్ ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వారసత్వ ప్రదేశాల సందర్శన అభినందనీయం



యువ యాత్రికులను సత్కరిస్తున్న ప్రముఖులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారతీయ కరెన్సీ నోట్లపై ముద్రించిన ప్రపంచ వారసత్వ ప్రదేశాలను సందర్శించడం అభినందనీయమని 48వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు అన్నారు. విజయవాడకు చెందిన షేక్.నయీమ్ పాషా, ఎం.ఉదయ్ నాగభూషణంలు 6,305 కిలోమీటర్ల దూరంలో ఉన్న వారసత్వ ప్రదేశాలను ఏడు రోజుల్లో సందర్శించడంతో వారిని గురువారం ఘనంగా సత్కరించారు. చిట్టినగర్‌లోని శ్రీ గౌతమ్ స్మార్ట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నయీమ్ పాషా, ఉదయ్ నాగభూషణంలను అత్తులూరి పెదబాబు, శ్రీగౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ సూర్యారావు, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు గాంధీ నటరాజన్‌లతో పాటు పలువురు సత్కరించారు. భారతీయ చారిత్రక ప్రదేశాల విశిష్టతను గుర్తించి అత్యంత వేగంగా ఆయా ప్రాంతాలను సందర్శించిన భారతీయ యాత్రికులుగా ఇద్దరు గుర్తింపు పొందారన్నారు.

50 నోట్లపై ముద్రించిన హంపిలోని రాతి రథం, 500 నోటుపై ముద్రించిన న్యూ ఢిల్లీలోని ఎర్రకోట, 100 నోటుపై ఉన్న పఠాన్‌లోని రాణి కి వావ్, రూ.20 నోటుపై ఉన్న ఔరంగాబాద్‌లోని ఎల్లోరా గృహలు, 200 నోటుపై ఉన్న భోపాల్‌లోని సాంచి స్థూపం, 10 నోటుపై ఉన్న కోణార్క్‌లోని సన్ టెంపుల్‌ను ఏడు రోజుల్లో సందర్శించామని నయీమ్ పాషా, నాగభూషణం తెలిపారు. గత నెల 19వ తేదీన గుంటూరు నుంచి రైలులో యాత్రను ప్రారంభించామన్నారు. యువ యాత్రికులను సత్కరించిన వారిలో బీజేపీ నాయకులు శివకుమార్ పటాన్నాయక్, అవ్వారు బుల్లాబ్బాయ్ తదితరులు ఉన్నారు.

- పెనమలూరు: ఈవీఎం కమిషనింగ్‌ను కృష్ణా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే.బాలాజీ పరిశీలించారు. ఆయన గురువారం గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్ పరిశీలించారు. అనంతరం ఈవీఎం కమిషనింగ్ సక్రమంగా చేశారా లేదా అనే విషయమై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.